# మనం



## నిజామాబాద్
## కామారెడ్డి



శనివారం । 13 । జూన్ । 2026 పేజీలు: 8




# జర్నలిస్టుల హక్కుల గళం

## టీయూడబ్ల్యూజే కామారెడ్డి జిల్లా తృతీయ మహాసభలు

2

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ.

జర్నలిస్టులు జర్నలిజం విలువలు కాపాడేలా కృషి చేయాలి.
- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి.

సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులది కీలక పాత్ర.
- మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.

ప్రముఖ పరిశ్రామికవేత్త సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో జర్నలిస్టులందరికి బ్యాగులు పంపిణీ.



కామారెడ్డి, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి )

శుక్రవారం కామారెడ్డి పట్టణంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ)తృతీయ మహాసభలు నిర్వహించారు. అలాగే జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టియుడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ మాట్లాడుతూ., కామారెడ్డి జిల్లాతో తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని తెలిపారు. ఇక్కడ జర్నలిస్టులకు అన్యాయం జరిగితే వచ్చి పోరాడిన చరిత్ర తమ సంఘానికి ఉందన్నారు. మల్లెపూల నరేందర్ పై కాల్పులు జరిగినప్పుడు దేశవ్యాప్తంగా ఆందోళన చేసి అన్యాయాన్ని అడ్డుకున్నామని గుర్తు చేశారు. తమ సంఘానికి 70 ఏళ్ల చరిత్ర ఉందని అన్నారు. పత్రిక యాజమాన్యాలు జర్నలిస్టుల పట్ల వివక్ష చూపుతున్నాయని విమర్శించారు. ఇప్పటికీ జర్నలిస్టులను స్ట్రింగర్లుగా పరిగణిస్తున్నారని, గ్రామీణ జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పారు.

### కళాశాలల మరమ్మతులు నెలాఖరులోపు
# పూర్తి చేయాలి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

6





# ఇందుప్రియపై సోషల్ మీడియా పోస్టులు.. ఎస్పీకి ఫిర్యాదు

- అసత్య ప్రచారం, విద్వేషపూరిత వ్యాఖ్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- సోషల్ మీడియాలో చేస్తున్న పోస్టులు సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన.
- మహిళా కమిషన్తో పాటు పార్టీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదుకు చర్యలు.
- అవమానకర వ్యాఖ్యలతో మానసిక వేధింపులకు గురిచేస్తున్నారు.. మాజీ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ.

4

మాజీ మున్సిపల్ చైర్పర్సన్, కాంగ్రెస్ నాయకురాలు గడ్డం ఇందుప్రియా తనపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు, దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీతో పాటు ఆయన అనుచరులుగా పేర్కొన్న పలువురిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కొందరు పక్కా ప్రణాళికతో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

# జర్నలిస్టుల హక్కుల గళం..

## టీయూడబ్ల్యూజే కామారెడ్డి జిల్లా తృతీయ మహాసభలు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ.
జర్నలిస్టులు జర్నలిజం విలువలు కాపాడేలా కృషి చేయాలి.
- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి.
సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులధి కీలక పాత్ర.
- మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.
ప్రముఖ పరిశ్రామికవేత్త సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో జర్నలిస్టులందరికి బ్యాగులు పంపిణీ.











కామారెడ్డి, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి ): శుక్రవారం కామారెడ్డి పట్టణంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ)తృతీయ మహాసభలు నిర్వహించారు. అలాగే జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టియుడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ మాట్లాడుతూ., కామారెడ్డి జిల్లాతో తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని తెలిపారు. ఇక్కడ జర్నలిస్టులకు అన్యాయం జరిగితే వచ్చి పోరాడిన చరిత్ర తమ సంఘానికి ఉందన్నారు. మల్లెపూల నరేందర్ పై కాల్పులు జరిగినప్పుడు దేశవ్యాప్తంగా ఆందోళన చేసి అన్యాయాన్ని అడ్డుకున్నామని గుర్తు చేశారు. తమ సంఘానికి 70 ఏళ్ల చరిత్ర ఉందని అన్నారు. పత్రిక యాజమాన్యాలు జర్నలిస్టుల పట్ల వివక్ష చూపుతున్నాయని విమర్శించారు. ఇప్పటికీ జర్నలిస్టులను స్ట్రింగర్లుగా పరిగణిస్తున్నారని, గ్రామీణ జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పారు. నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులకు తమ సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, అవినీతికి పాల్పడే వారికి సహకరించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాన డిమాండ్లు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 100% ఫీజు రాయితీతో ప్రవేశం కల్పించాలని, జర్నలిస్టుల సంక్షేమ పథకాలను మేనిఫెస్టోలో చేర్చి అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్లతో అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు అందించామని రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారు.

అనంతరం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ., జర్నలిస్టులు జర్నలిజం విలువలు కాపాడేలా కృషి చేయాలని అన్నారు. సమాజంలో జర్నలిస్టులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా జర్నలిస్టులు పని చేస్తారని, ప్రస్తుతం పెయిడ్ జర్నలిజంతో విలువలు తగ్గిపోతున్నాయని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఏది నిజం, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నిజానిజాలను నిగ్గు తేల్చడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని, ప్రజలకు ఉపయోగపడేలా, వారి సమస్యల పరిష్కారమయ్యేలా వార్తలు ప్రచురించాలన్నారు. అనంతరం కామారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జర్నలిస్టుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ., సమాజ శ్రేయస్సు, ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరిస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తున్న పాత్రికేయుల సేవలు అమూల్యమని పేర్కొన్నారు. నిజాయితీ, నిబద్ధతతో వార్తలను ప్రజలకు చేరవేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో జర్నలిస్టులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఉమారాణి అన్నారు. వృత్తి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజా ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తున్న పాత్రికేయుల సంక్షేమానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం ప్రముఖ పరిశ్రామికవేత్త సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో జర్నలిస్టులందరికి బ్యాగులు పంపిణీ చేసారు.

### కామారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజే(ఐజేయు) నూతన కార్యవర్గం.

కామారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజే(ఐజేయు) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికైన సభ్యులతో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రమాణస్వీకారం చేయించారు. జిల్లా అధ్యక్షుడిగా రజనీకాంత్, కార్యదర్శిగా తోట రాజేష్, కోశాధికారిగా ముదాం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా సయ్యద్ కౌసర్అలీ, ఎండీ అబీద్, ముదాం శంకర్, బాలయ్య, ఎండీ యూనస్, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాస్ రెడ్డి, సాయిప్రసాద్, కే.శ్రీనివాస్ రావు , యు.రామకృష్ణ, లక్ష్మినారాయణ, కార్యవర్గ సభ్యులుగా జీ. సుభాష్, శ్రీకాంత్, ఈ.వెంకటేశ్వర్లు, ఇంజమూరి శ్రీనివాస్, కే.గంగాధర్, జే.బాలప్రకాష్, ఎండీ వాజీద్ అలీ, జి.శ్రీనివాస్, మేకల రవి, భవాని ఎన్నికయ్యారు.

ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడుగా పి.శ్రీనివాస్, కార్యదర్శిగా బి. సుధాకర్ గౌడ్, కోశాధికారిగా జి. సత్య నారాయణ గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంఏ మజీద్, సహాయ కార్యదర్శులుగా రామేశ్వర్ రావు, ఎన్.సాయిరాం, జే.వీరయ్య, రవీందర్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా అవునూరి ఆశన్న, ఎండీ రజాక్, పోచయ్య, గంగాధర్, బన్సీలాల్, దినకర్, ప్రవీణ్ కుమార్లు ఎన్ని కయ్యారు.

---

# కాంగ్రెస్ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించొద్దు

- ఇందుప్రియ ఆరోపణలు నిరాధారమని పట్టణ కాంగ్రెస్ ఖండన.
- మహిళలను గౌరవించడం కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సిద్ధాంతమని స్పష్టం.
- మహిళలను కించపరిచే వార్తలు ప్రచురించిన వారిపై చర్యలు తీసుకోవాలి.
- పార్టీ అంతర్గత అంశాలను మీడియా ముందుకు తీసుకురావడం క్రమశిక్షణా రాహిత్యం.



కామారెడ్డి, జూన్ 12: కాంగ్రెస్ పార్టీపై, నాయకత్వంపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేనీ సందీప్ పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయం నుంచి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాజీ మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

మహిళలను గౌరవించడం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని, మహిళలను కించపరిచే విధంగా వార్తలు ప్రచురించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను కోరారు. రాష్ట్రంలో ఎక్కడో ప్రచురితమైన వార్తలను ఆధారంగా చేసుకుని కామారెడ్డి కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేయడం అనుచితమని అన్నారు. పార్టీలో ఏవైనా విభేదాలు, ఫిర్యాదులు ఉంటే పార్టీ రాజ్యాంగం ప్రకారం సంబంధిత కమిటీల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

### క్రమశిక్షణ కమిటీ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

క్రమశిక్షణ కమిటీ పరిశీలనలో ఉన్న అంశాలపై మీడియా సమావేశాలు నిర్వహించి వ్యాఖ్యలు చేయడం పార్టీ వ్యవస్థను ధిక్కరించడమేనని పేర్కొన్నారు. ఇందుప్రియ వ్యాఖ్యలు ప్రత్యర్థి బీఆర్ఎస్కు రాజకీయంగా లాభం చేకూర్చే విధంగా ఉన్నాయని, పార్టీకి నష్టం కలిగించే చర్యలపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ తగిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. అవసరమైతే అధికారిక ఫిర్యాదు కూడా సమర్పిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు భూమని బాలరాజ్, బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రెడ్డి నాయక్, పట్టణ మహిళా అధ్యక్షురాలు సుమప్రియ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ విజయానికి సమన్వయ సమావేశం

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సీహెచ్. వి.ఆర్.ఆర్. వరప్రసాద్ అధ్యక్షత.**
**- జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి. నాగరాణి.**
**- ఈ నెల 20న లోక్ అదాలత్ నిర్వహణ ఏర్పాట్లు, శాఖల మధ్య సమన్వయంపై విస్తృత చర్చ.**
**- ప్రజలకు త్వరగ, తక్కువ వ్యయంతో న్యాయం అందించడంలో లోక్ అదాలత్ల ప్రధాన పాత్ర.**



కామారెడ్డి, జూన్ 12 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేసేందుకు కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సీహెచ్. వి.ఆర్.ఆర్. వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి. నాగరాణి పాల్గొన్నారు. సమావేశంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, రాజీ పరిష్కారానికి అనుకూలమైన పెండింగ్ మరియు ప్రీ-లిటిగేషన్ కేసులను గుర్తించి లోక్ అదాలత్కు రిఫర్ చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు త్వరితగతిన, తక్కువ వ్యయంతో న్యాయం అందించడంలో లోక్ అదాలత్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

**పెండింగ్, ప్రీ-లిటిగేషన్ కేసుల పరిష్కారంపై చర్చ**

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ., జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలు తమ వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. రాజీకి అనుకూలమైన కేసులను గుర్తించి అధిక సంఖ్యలో లోక్ అదాలత్కు రిఫర్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ, లోక్ అదాలత్ విజయవంతానికి పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. రాజీ పరిష్కారానికి అనువైన కేసులను గుర్తించి లోక్ అదాలత్కు పంపించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి. నాగరాణి మాట్లాడుతూ, జాతీయ లోక్ అదాలత్పై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని కోరారు.

**లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలి**

అధికారుల వివరాల ప్రకారం, జాతీయ లోక్ అదాలత్లో వివిధ రకాల సివిల్ కేసులు, రాజీ పరిష్కార యోగ్యమైన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార దావాలు, బ్యాంకు రుణ వివాదాలు, కుటుంబ తగాదాలు తదితర అంశాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉంది. ఈ నెల 20న నిర్వహించే లోక్ అదాలత్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయశాఖ అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులతో ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించారు. బ్యాంకు రుణ వివాదాలు, రాజీకి అనుకూలమైన పెండింగ్ కేసులను ముందుగానే గుర్తించి లోక్ అదాలత్కు రిఫర్ చేయడం, కేసుల త్వరిత పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# పరిశుభ్రతతోనే ఆరోగ్య రక్షణ.. కూనెపల్లిలో అవగాహన కార్యక్రమం

**- ప్రజల్లో అవగాహన కల్పించిన సర్పంచ్ ఈరబోయిన మల్లేష్, ఉపసర్పంచ్ మాధగోని శ్రీనివాస్ గౌడ్...**





రెంజల్, జూన్ 12 (మనం న్యూస్): రెంజల్ మండలంలోని కూనెపల్లి గ్రామంలో శుక్రవారం 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ ఈరబోయిన మల్లేష్, ఉపసర్పంచ్ మాధగోని శ్రీనివాస్ గౌడ్ నాయకత్వం వహించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సర్పంచ్ ఈరబోయిన మల్లేష్ మాట్లాడుతూ., ప్రజల ఆరోగ్య పరిరక్షణే గ్రామ పంచాయతీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి కుటుంబం పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక అంటువ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉపసర్పంచ్ మాధగోని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ., గ్రామాన్ని వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ప్రతి శుక్రవారం నిర్వహించే 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాగ్య, ఆశా కార్యకర్త ఉమా, పంచాయతీ కార్యదర్శి రజినీ తదితరులు పాల్గొన్నారు.



# సెయింట్ పాల్ స్కూల్లో క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

ఆర్మూర్, జూన్ 12 (మనం న్యూస్): ఆర్మూర్ స్థానిక సెయింట్ పాల్ స్కూల్లో నిర్వహించిన క్రికెట్ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ఘనంగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేసి అభినందించారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, క్రమశిక్షణతో ముందుకు సాగాలని నిర్వాహకులు సూచించారు. పోటీలలో పాల్గొన్న చిన్నారులు ఉత్సాహంగా తమ ప్రతిభను కనబరిచారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు క్రీడాభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ., విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు తరచూ నిర్వహిస్తామని తెలిపారు.

# యూరియా యాప్‌ను రద్దు చేయాలి

**- బీజేపీ పార్టీ డిమాండ్**



ఆర్మూర్, జూన్ 12 (మనం న్యూస్): భారతీయ జనతా పార్టీ ఆలూర్ మండల శాఖ అధ్యక్షులు సూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ (ఎంఆర్వో)కు యూరియా సరఫరాపై గురువారం మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ జిల్లా కార్యదర్శి పోల్కం వేణు మాట్లాడుతూ., రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. వెంటనే యూరియా బుకింగ్ యాప్ విధానాన్ని రద్దు చేసి, మండల స్థాయి ప్రతిపాదికను మార్చి స్థానిక సహకార సంఘాలు, ఫెర్టిలైజర్ దుకాణాల ద్వారా రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.అలాగే ఎకరానికి యూరియా కేటాయింపుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని కోరారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందకపోతే పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి హరీష్, జిల్లా నాయకులు సుభాష్, బాస సురేష్, ప్రశాంత్, మండల ఉపాధ్యక్షులు పోశెట్టి, ఒబీసీ మోర్చా అధ్యక్షులు నడిశారం మల్లయ్య, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మహేష్, సీనియర్ నాయకులు నాగేష్, సురేష్ గౌడ్, అజయ్, సాయి పటేల్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్లపై అక్రమ కట్టడాలు పెరుగుతున్న ప్రమాదాలు

- అనుమతులు లేకుండానే నిర్మాణాలు.
- గ్రామపంచాయతీ కార్యదర్శుల కుమ్మక్కు ఉందని స్థానికుల ఆరోపణ.

కమ్మర్ పల్లి, జూన్ 12 (మనం న్యూస్): కమ్మర్ పల్లి మండలంలో కొనసముందర్ గ్రామంలో రోడ్లపై అక్రమ కట్టడాలు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండానే కొందరు గ్రామాల్లో ఇళ్ల ముందు వరకు రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల ఇళ్ల ముందు బెడ్లు మెట్లు, ప్లాట్ఫారాలు నిర్మించడం వల్ల రహదారులు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా అత్యవసర సేవల వాహనాలు, వ్యవసాయ వాహనాలు, స్కూల్ బస్సులు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు. గతంలో విధులు నిర్వహించిన గ్రామపంచాయతీ కార్యదర్శి సహకారంతోనే ఈ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలో రోడ్ల ఆక్రమణలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు విచారణ నిర్వహించి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఆర్డీఓ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సహాయ కేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డి, జూన్12 (మనం న్యూస్): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, ఎల్లారెడ్డి ఆర్డీఓ తో కలిసి శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ., పారదర్శకమైన మరియు ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీ లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రక్రియకు సంబంధించిన సమాచారం అందించడంతో పాటు ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం 1950 టోల్ ఫ్రీ నంబర్ సేవలను అందుబాటులోకి



తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలు మరియు ఇతర అంశాలకు సంబంధించి ప్రజలు 1950 టోల్ ఫ్రీ నంబర్ను సంప్రదించి సేవలు పొందవచ్చని తెలిపారు. ప్రతి అర్హులైన పౌరుడు ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందుప్రియపై సోషల్ మీడియా పోస్టులు.. ఎస్పీకి ఫిర్యాదు

- అసత్య ప్రచారం, విద్వేషపూరిత వ్యాఖ్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- సోషల్ మీడియాలో చేస్తున్న పోస్టులు సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన.
- మహిళా కమిషన్తో పాటు పార్టీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదుకు చర్యలు.
- అవమానకర వ్యాఖ్యలతో మానసిక వేధింపులకు గురిచేస్తున్నారు.. మాజీ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ.


కామారెడ్డి, జూన్ 12 (మనం న్యూస్): మాజీ మున్సిపల్ చైర్పర్సన్, కాంగ్రెస్ నాయకురాలు గడ్డం ఇందుప్రియా తనపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు, దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీతో పాటు ఆయన అనుచరులుగా పేర్కొన్న పలువురిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కొందరు పక్కా ప్రణాళికతో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఫేస్బుక్, వాట్సాప్ వేదికగా వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలు చేస్తూ తనను మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. ఇలాంటి పోస్టులు సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. మహిళా కమిషన్తో పాటు పార్టీ క్రమశిక్షణ కమిటీకి కూడా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. మహిళగా తాను రాజకీయంగా



ఎదుగుతుండటాన్ని జీర్ణించుకోలేక తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం, విద్వేషపూరిత వ్యాఖ్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని మహిళలకు రక్షణ కల్పించాలని ఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ ఎస్సీ సెల్ మహిళా రాష్ట్ర కార్యదర్శి పిడుగు మమత, రంగ మాధవి, డీడీసీ ఉపాధ్యక్షులు నిమ్మ విజయకుమార్ రెడ్డి, పంపరి లక్ష్మణ్, డిసిసి జనరల్ సెక్రెటరీ జూలూరి సుధాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డమీది మహేష్, తాటి లావణ్య ప్రసాద్,మాజీ కౌన్సిలర్లు సలీం, రంగ రమేష్ గౌడ్,చాట్ల వంశీ దీక్షిత, పిడుగు మమత సాయిబాబా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ చట్టానికి పాతర

**గాంధారి మండల పంచాయతీ అధికారి వింత సమాధానం...!**
**రికార్డుల తనిఖీ, బ్యాంకు వివరాల కోసం ఏకంగా రూ. 5 వేలు కట్టాలంటూ హుకుం...**
**బ్యాంకు అధికారులు అడుగుతున్నారంటూ నెపం నెట్టేసిన అధికారి**
**చట్టంపై అవగాహన లేదా?**
**సమాచారం ఇవ్వకుండా తప్పించుకునేందుకే ఈ సాకులా..?**



Mandal Panchayath Officer
M.P.P. GANDHARI

కామారెడ్డి, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి న్యూస్ ): ప్రజలకు పారదర్శకంగా సమాచారం అందించి అండగా నిలవాల్సిన ప్రభుత్వ అధికారులు సమాచార హక్కు చట్టాన్ని పూర్తిగా అపహాస్యం చేస్తున్నారు. చట్టాల పట్ల కనీస అవగాహన లేకుండా, దరఖాస్తుదారులను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం అధికారులకే చెల్లింది. ప్రభుత్వ రికార్డుల తనిఖీ కోసం శ్రావణ్ కుమార్ దరఖాస్తు చేసుకోగా.. సదరు గాంధారి మండల పంచాయతీ అధికారి ఇచ్చిన సమాధానం ఆయన బాధ్యతారాహిత్యానికి, నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. సమాచారం ఇవ్వడం ఇష్టం లేకనో, లేదా దరఖాస్తుదారుడిని భయపెట్టడానికో గానీ.. రూ. 5,000 వరకు రుసుము కట్టాలంటూ నిబంధనలకు విరుద్ధంగా చెప్పడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

**బ్యాంకు అధికారుల పేరుతో మండలాధికారి సంజాయిషీ!**

సమాచార హక్కు చట్టం ప్రకారం రికార్డుల తనిఖీ కోసం దరఖాస్తు చేసుకుంటే, సదరు మండల పంచాయతీ అధికారి దాదాపు రూ. 3,000 నకలు కోసం కట్టాలని దరఖాస్తుదారునికి తెలిపారు. ఇది చాలదన్నట్టు, సదరు వ్యవహారానికి సంబంధించిన ఒక సంవత్సరం బ్యాంకు స్టేట్మెంట్ కోసం బ్యాంకు అధికారులు రూ. 2,000/- అడుగుతున్నారని సదరు మండలాధికారే స్వయంగా దరఖాస్తుదారునికి సమాధానం ఇవ్వడం అత్యంత విచారకరం.

బ్యాంకు అధికారులు అడిగితే ఆ నిబంధనలు చట్టప్రకారం సరైనవేనా కాదా అని సరిచూసుకోవాల్సిన బాధ్యత కలిగిన అధికారే.. ఇలా దరఖాస్తుదారుడిపై ఆ భారాన్ని నెట్టేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**చట్టం ఏం చెబుతోంది...? అధికారులు ఏం చేస్తున్నారు..?**

ఆర్టీఐ చట్టం-2005 ప్రకారం..రికార్డుల తనిఖీకి మొదటి గంట ఉచితం, ఆ తర్వాత ప్రతి గంటకు కేవలం రూ. 5 మాత్రమే వసూలు చేయాలి. ఏదైనా సమాచారం జెరాక్స్ (నకలు) రూపంలో కావాలంటే ప్రతి ఏ-4 సైజు పేజీకి కేవలం రూ. 2 మాత్రమే ప్రభుత్వ రుసుము ఉంటుంది. పరిస్థితి ఇలా ఉంటే, ఒక సాధారణ పౌరుడు సమాచారం అడిగితే రికార్డుల తనిఖీకి, బ్యాంకు స్టేట్ మెంట్ కి కలిపి మొత్తం రూ. 5,000 అవుతుందని మండలాధికారే స్వయంగా లెక్కలు చెప్పడం.. చట్టాన్ని ఉద్దేశపూర్వకంగా నీరుగార్చడమే అవుతుంది. అవినీతిని, అక్రమాలను బయటకు రాకుండా అడ్డుకునేందుకే అధికారులు ఇలాంటి భారీ ఫీజుల పేరుతో దరఖాస్తుదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఇది అవగాహనా రాహిత్యమా..? ఉద్దేశపూర్వక వేధింపా..?**

బాధ్యతాయుతమైన కుర్చీలో కూర్చున్న మండల పంచాయతీ అధికారికి సమాచార హక్కు చట్టం నిబంధనలు తెలియవా? బ్యాంకు అధికారులు వేలల్లో డబ్బులు అడుగుతుంటే.. ఒక ఆర్టీఐ అధికారిగా దాన్ని ప్రశ్నించాల్సింది పోయి, దరఖాస్తుదారుడికే ఆ మొత్తాన్ని కట్టమనడం ఖచ్చితంగా బాధ్యతలనుండి తప్పించుకోవడమే అవుతుంది.

**ఉన్నతాధికారులు స్పందించాలి..**

పాలనలో పారదర్శకత కోసం తెచ్చిన ఆర్టీఐ చట్టాన్ని ఇలా సాకుల పేరుతో సమాచారాన్ని దాచేందుకు వాడుకుంటున్న అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే నిఘా పెట్టాలి. నిబంధనలకు విరుద్ధంగా మొత్తం రూ. 5,000 డిమాండ్ చేస్తూ బ్యాంకు అధికారులపై నెపం నెట్టిన సదరు మండల పంచాయతీ అధికారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుదారునికి చట్టప్రకారం తక్కువ ధరకే సమాచారం అందేలా చూడాలని ప్రజా సంఘాలు, ఆర్టీఐ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

# అక్రమ చెట్ల నరికివేత, రవాణాపై కఠిన చర్యలు

**- అటవీ సంపద పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరం.**
**- ఫారెస్ట్ రేంజ్ అధికారి కె నర్సింగరావు**



నిజామాబాద్ రూరల్, జూన్ 12 (మనం న్యూస్): అటవీ ప్రాంతాల్లో అక్రమంగా చెట్లను నరికివేయడం, రవాణా చేయడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ శాఖ అధికారులు హెచ్చరించారు. జూన్ 1 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో పలువురు నిందితులను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. అటవీ సంపద ప్రకృతి సమతుల్యతకు మూలాధారమని, విలువైన టేకు సహా ఇతర చెట్లను అక్రమంగా నరికివేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. చెట్ల నరికివేత, అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సిరికొండ రేంజ్ ఫారెస్ట్ అధికారి కె. నర్సింగరావు మాట్లాడుతూ., అటవీ సంపద పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవులను సంరక్షించి భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. అలాగే చెట్ల పెంపకం, వన్యప్రాణుల సంరక్షణ, అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే ఫారెస్ట్ శాఖకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఫారెస్ట్ అధికారి గంగారం, తహసీల్దార్ ఆర్. రవీందర్ రావు, మండల అభివృద్ధి అధికారి కె.ఆర్. మనోహర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఫారెస్ట్ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





## కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ధాన్యం వెంటనే తరలించాలి: అడిషనల్ కలెక్టర్ విక్టర్

నాగిరెడ్డిపేట్, జూన్ 12 (మనం న్యూస్): మండలంలోని తాండూర్ కిచ్చన్నపేట సొసైటీ పరిధిలో గల ఆత్మకూర్, జలాల్పూర్, రాఘవపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ విక్టర్, డీసీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా తాండూర్ సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటి నుంచి ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలు సకాలంలో అందుబాటులో లేకపోవడంతో కేంద్రాల్లో భారీగా ధాన్యం నిల్వ ఉందని తెలిపారు. అకాల వర్షాల కారణంగా నింపిన ధాన్యపు బస్తాలు తడిసిపోతున్నాయని, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వెంటనే అదనపు లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ను కోరారు.దీనిపై స్పందించిన అడిషనల్ కలెక్టర్ విక్టర్, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో తరలించేందుకు అవసరమైన లారీలను ఏర్పాటు చేసి, వెంటనే మిల్లులకు పంపించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్, జలాల్పూర్ గ్రామాల సర్పంచులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మానిటరింగ్ అధికారి లక్ష్మణ్, సీఈవో మురళి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డీసీఎం వాన్ ఢీకొని మేకల కాపరి, 20 మేకలు మృతి



ఎల్లారెడ్డి, జూన్12 (మనం న్యూస్): ఎల్లారెడ్డి రహదారిపై కొట్టాల్ గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మేకల కాపరి శివయ్య, 20 మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. గ్రామస్తుల కథనం ప్రకారం., కొట్టాల్కు చెందిన ఆలకుంట శివయ్య, బోదాస్ గంగారం, కిషన్ తమ మేకలను కొట్టం నుంచి వదిలి మేత కోసం అడవికి తోలుకెళ్తున్నారు. అదే సమయంలో కామారెడ్డి వైపు నుంచి ఎల్లారెడ్డి వైపు అతివేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ మేకలను, కాపరి శివయ్యను ఢీకొట్టింది. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆలకుంట శివయ్యకు చెందిన 13 మేకలు, బోదాస్ గంగారాంకు చెందిన 2 మేకలు, కిషన్కు చెందిన 5 మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ సమాచారం అందుకున్న ఎల్లారెడ్డి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## యూరియా కొరత నివారించాలి

**- రైతులకు సులభంగా అందుబాటులో ఉంచాలి.**
**- తహసీల్దార్కు బీజేపీ కిసాన్ మోర్చా వినతి.**

నిజామాబాద్ రూరల్, జూన్ 12 (మనం న్యూస్): వరి సాగు చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ సిరికొండ మండల కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం మండల తహసీల్దార్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సిరికొండ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు చౌటుపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ., ప్రస్తుతం వరి పంటకు అత్యంత కీలకమైన సమయంలో యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోందని తెలిపారు. యాప్ ఆధారిత ఆన్లైన్ బుకింగ్ విధానంలో సాంకేతిక సమస్యల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బుక్ చేసుకున్నప్పటికీ సకాలంలో యూరియా అందడం లేదని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని యూరియా పంపిణీని మరింత పారదర్శకంగా నిర్వహించాలని, స్థానిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీలు), ఎరువుల దుకాణాల ద్వారా రైతులకు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారం చూపాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కిసాన్ మోర్చా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## మోదీ 12 ఏళ్ల పాలనలో గ్రామీణాభివృద్ధికి కొత్త దిశ..

**- మోదీ పాలనలో జాతీయ ఉపాధి హామీ కొత్త రోడ్ల మంజూరు.**
**- వడ్డీ మోహన్ రెడ్డి**
**- వికసిత్ భారత్ సంకల్ప సమ్మేళనంలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన.**



రెంజల్, జూన్ 12 (మనం న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసుకున్న 12 ఏళ్ల పాలనలో దేశవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్న విశేష్ జన సంపర్క్ అభియాన్లో భాగంగా రెంజల్ మండలంలోని నీలా గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ ఇంచార్జి వడ్డీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ., మోదీ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జాతీయ ఉపాధి హామీ పథకం అలాగే కొత్త రోడ్ల మంజూరు, మౌలిక వసతుల కల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుతో గ్రామాల రూపురేఖలు మారుస్తోందన్నారు. దేశాన్ని వికసిత్ భారత్గా తీర్చిదిద్దే దిశగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. గత 12 సంవత్సరాలుగా పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికి చేరవేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు క్యాతం యోగేష్, ప్రసాద్ రాజు, అశోక్, నవీన్, మదారి గంగాధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.







## కళాశాలల మరమ్మతులు నెలాఖరులోపు పూర్తి చేయాలి

**- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

కామారెడ్డి, జూన్ 12 (మనం జిల్లా ప్రతినిధి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపడుతున్న మైనర్ రిపేర్ పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పనుల పురోగతిని పరిశీలించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఇంజనీర్లకు సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతిరోజూ కళాశాలలను సందర్శించాలని, సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం, బాన్సువాడ డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ అంజయ్య, కామారెడ్డి డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీల్ అసిస్టెంట్ రమేష్కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

**- స్వీట్లు పంచుకొని అభినందనలు తెలిపిన ఎంపీడీవో వారణాసి కమలాకర్.**



రెంజల్, జూన్ 12 (మనం న్యూస్): రెంజల్ మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన ఫీల్ అసిస్టెంట్ రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎంపీడీవో వారణాసి కమలాకర్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో స్వీట్లు పంచుకొని రమేష్కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయురారోగ్యాలతో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ అందరి అభిమానాన్ని సంపాదించుకున్న ఫీల్ అసిస్టెంట్ రమేష్కు అధికారులు, సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆత్మీయంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వారణాసి కమలాకర్, ఎంపీవో రఫీ, వినాయక్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొని రమేష్కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేడు మెల్లకుంట తండాలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నాగిరెడ్డిపేట్, జూన్ 12 (మనం న్యూస్): మండలంలోని మెల్లకుంట తండాలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి తెలిపారు. రైతులు పండించిన జొన్నలకు గిట్టుబాటు ధర కల్పించడం, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించే అవకాశం కల్పించడమే ఈ కొనుగోలు కేంద్రం ఏర్పాటు ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆకిడి గంగారెడ్డి మాట్లాడుతూ, జొన్నల సాగు చేసిన రైతులు తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించుకోవచ్చన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. తూకం, నిల్వ, రవాణా తదితర అంశాల్లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు.కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రామావత్ వాసురం మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రైతులు తమ పంటను సరైన ధరకు విక్రయించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. జొన్నల కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించబడుతుందని, రైతులు ఎలాంటి సందేహాలు లేకుండా కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై కొనుగోలు కేంద్ర ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. రైతులు నిర్ణీత సమయానికి కేంద్రానికి చేరుకొని కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

# వర్షం పడదు.. వేడి తగ్గదు...

**- వాతావరణ పరిస్థితులతో జనం బెంబేలు.**





మోర్తాడ్, జూన్ 12 (మనం న్యూస్); వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్న మేఘాలు మొఖం చాటేసాయి. రాత్రిపూట అక్కడో ఇక్కడో గర్జిస్తున్న మేఘం ఉదయం మాత్రం ఏ మాత్రం ప్రభావం చూపడం లేదు. మృగశిర కార్తె తో వర్షాకాలం ప్రారంభమవుతుందని అందుకే పంటల సాగు ప్రారంభమని రైతుల నమ్మకం. అప్పటినుండే పంటల సాగులు ప్రారంభమవుతాయి. అయితే ఈ వేసవిలో తీవ్ర ప్రభావాన్ని చూపిన సూర్యుడు ఇంకా తన కోపాన్ని తగ్గించుకున్నట్లు కనిపించడం లేదు. ఉదయం 8 గంటలకే ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం ఏడు గంటలు దాటుతున్న కూడా ఇంకా చీకట్లు కమ్ముకోక వెలుతురే కనిపిస్తోంది. మధ్యాహ్నం సమయంలో ఎండల వేడి ఎక్కువగా ఉండడంతో ఇప్పటికీ కూడా ప్రజలు రోడ్లమీదకి రావాలంటే భయపడుతున్నారు. ఈసారి ఎండాకాలం చాలా ప్రభావాన్ని చూపించిందని చెప్పవచ్చు. దాదాపు 46, 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లుగా రెవిన్యూ అధికారిక రికార్డులు చెబుతున్నాయి. పెరిగిన విద్యుత్ వినియోగం కూడా దీనికి అద్దం పడుతుంది. గత వేసవి కంటే కూడా ఈ వేసవిలో విద్యుత్ వినియోగం దాదాపు 40 శాతం పెరిగినట్లుగా విద్యుత్ శాఖ అధికారులు లెక్కలు చెబుతున్నాయి. దీనిని బట్టి ఎండల తీవ్రత ఎంతగా ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చు. ఏసీలకు కూలర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. ఉపాధి హామీ కూలీలకు కూడా పనులను ఉదయం పూటనే కల్పించిన విషయం విధితమే. నైరుతి రుతుపవనాలు వచ్చేస్తున్నాయని, వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులతో పాటు ప్రజలు కూడా చాలావరకు సేద దీరుతున్నట్లుగానే కనిపించారు. అయితే పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికి కూడా వర్షాలు కురిసిన దాఖలాలు ఏమాత్రం లేవు. మోర్తాడు, కమ్మర్పల్లి, ఏరుగట్ల మండలాల పరిధిలో గురువారం రాత్రి భారీ ఈదురుగాలులతో ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. దీనివల్ల వాతావరణంలో మార్పులు వస్తాయని భావించినప్పటికిని తిరిగి శుక్రవారం మళ్లీ ఎండ వేడి ఎక్కువగానే కనిపించింది. ఉదయం 11 దాటిందంటే చాలు బస్టాండ్ ప్రాంతాలు ప్రయాణ ప్రాంగణాలు దాదాపుగా బోసిపోతున్నట్లుగానే కనిపిస్తున్నాయి. ప్రయాణికులను చేరవేసే ఆటోలు చెట్ల కిందికి పరిమితమవుతున్నాయి. ద్విచక్ర వాహనాల సంచారం ఉదయం సాయంత్రం వేళలోని కనిపిస్తోంది. వాస్తవానికి శుక్రవారం పాఠశాలలు తెరుచుకోవాల్సింది. అయితే ఎండల తీవ్రత ఎక్కువగా ఉందనే నేపద్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని మార్చి 15 జూన్ నుండి పాఠశాలలు ప్రారంభం చేయాలని నిర్ణయం తీసుకుంది. దీంతో సెలవులలో అమ్మమ్మ ఇండ్లకు వచ్చిన పిల్లలు ఇంకా సొంత గ్రామాలకు రాకపోకలు ప్రారంభించలేదు. తగ్గాల్సిన ఎండలు మాత్రం ఇంకా ప్రభావాన్ని చూపుతూనే ఉన్నాయి. గత మూడు రోజులుగా ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. రైతులు కూడా పంట పొలాలకు ఉదయం పుటే వెళ్లి పనులు చేసుకుంటున్నారు. పసుపు మొక్కజొన్న తదితర పంటల సాగును ఇప్పటికే ప్రారంభించిన రైతులు వేకుజామున 5 గంటలకే పంట పొలాలలో ప్రారంభిస్తూ 10:30 కల్లా ఇళ్లకు చేరుకుంటున్నారు. ఆ తర్వాత పంట పొలాలన్నీ నిర్మానుష్యమే. రెండు మూడు రోజులపాటు వర్షాలు కురిస్తే తప్ప వాతావరణ పరిస్థితుల్లో మార్పు వచ్చే అవకాశం కనిపించడం లేదని అయితే భారీ ఈదురుగాలులకే మేఘావృతాలు పరిమితం అయ్యాయని రైతులతో పాటు ప్రజలు ఆవేదన పొందుతున్నారు. ఎండాకాలం ప్రభావం తగ్గుతప్ప ప్రజల ఆరోగ్య ఆర్థిక సమస్యలు కూడా మెరుగుపడే సూచనలు కనిపించడం లేదు.

### గాలి ప్రారంభమైందా విద్యుత్ కట్


ఒక్కసారిగా ఆకాశంలో మెగావృతాలే విపరీతమైన వేగంతో గాలులు ఇస్తే గమనిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సేవలను నిలిపివేస్తున్నారు. గాలులు ఆగిపోయిన తర్వాతే తిరిగి విద్యుత్ సేవలను పునరుద్ధరిస్తున్నారు. ఒక్కసారిగా విద్యుత్ నిలిచిపోవడంతో పగలైనా రాత్రి అయినా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొక తప్పడం లేదు. గాలుల వల్ల విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉంటుందని అందువల్లే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ప్రమాదాల తీవ్రత తగ్గించడానికి ఈ చర్యలు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నారు. అయితే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చి ఎక్కడికక్కడ జంపర్లను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఏదైనా ఇబ్బంది ఏర్పడితే యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టే అవకాశం ఉందని అయినప్పటికీని విద్యుత్ శాఖ అధికారులు ముందస్తుగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఇండ్లలో ఇబ్బందులు తప్పడం లేదన్నది ప్రజల విమర్శ. మొత్తానికి ఈ సంవత్సరం ముందస్తుగానే ఎండల తీవ్రతను ప్రదర్శిస్తూ ప్రారంభమైన ఎండాకాలం ముగిసిన కూడా తన ప్రభావాన్ని ఇంకా చూపిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ పనుల వేగం తగ్గడంతో పాటు ప్రజల రాకపోకలు కూడా ఇంకా మెరుగుపడలేదు. ఇంకో వారం రోజులపాటు పరిస్థితి ఇలాగే ఉండవచ్చని, ముందస్తు జాగ్రత్తలు ఇంకా తీసుకోవాల్సి ఉంటుందని, రైతులు కూడా ఇప్పుడే వరినట్లు ప్రారంభించవద్దని అధికారులు సూచిస్తున్నారు. ఏది ఏమైనాపటికిని ఎండల తీవ్రత రుచిచూసిన ప్రజలు మాత్రం గతంలో ఎన్నడూ కూడా ఇంత వేడిని అనుభవించలేదని రానున్న కాలంలో ఇంకెన్ని తీవ్రతలు చూడాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

# ఇటు విద్యుత్ భయం.. అటు విషసర్పాల బెడద...

- చీకటిలో బిక్కుబిక్కుమంటున్న ఇందిరమ్మ కాలనీ ప్రజలు.
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం...
- ప్రజల ప్రాణాలతో చెలగాటం కదలని విద్యుత్ అధికారులు...






గ్రామ పంచాయతి కార్యాలయము-కూనెపల్లి
OFFICE OF THE GRAMA PANCHAYATH - KUNEPALLY

రెంజల్, జూన్ 12 (మనం న్యూస్): రెంజల్ మండలంలోని కూనెపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లపై నుంచి ప్రమాదకరంగా వెళుతున్న విద్యుత్ సర్వీస్ వైర్లు స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న భయంతో కాలనీవాసులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. విద్యుత్ వైర్ల ప్రమాదం కారణంగా రాత్రి వేళల్లో ఇళ్లలో ఉండేందుకు కూడా ప్రజలు భయపడుతున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా కొందరు కుటుంబాలు సమీప కాలనీల్లో బంధువులు, పరిచయస్తుల ఇళ్లలో రాత్రి వేళలు గడుపుతున్న పరిస్థితి నెలకొంది. ఒకవైపు విద్యుత్ ప్రమాదం భయపెడుతుండగా, మరోవైపు ఇటీవల కాలంలో ఇళ్లలోకి విషసర్పాలు ప్రవేశించడం ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. గ్రామ పంచాయతీ తరఫున సంబంధిత ఏడీకి పలుమార్లు లేఖలు అందజేసినా అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే విద్యుత్ వైర్లను తొలగించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రమాదం మరింత పెరిగే అవకాశముందని, ఏదైనా అపశృతి జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ప్రమాదకర విద్యుత్ వైర్ల సమస్యను పరిష్కరించి, ఇందిరమ్మ కాలనీ ప్రజలకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



# అత్యధిక ప్రజాదరణ ఉన్న ప్రధాని నరేంద్ర మోదీనే

- తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుంది.. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి.

కామారెడ్డి, జూన్ 12 (మనం న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ పదవీకాలం 12 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., దేశానికి అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన ఘనత నరేంద్ర మోదీదేనని పేర్కొన్నారు. దేశ ప్రజల్లో అత్యధిక ప్రజాదరణ పొందిన ప్రధానమంత్రి కూడా మోదీయేనని అన్నారు. భారతదేశాన్ని ప్రపంచ వేదికపై మరింత బలోపేతంగా నిలబెట్టి, విశ్వగురుగా తీర్చిదిద్దడమే మోదీ సంకల్పమని చెప్పారు. దేశ అభివృద్ధి, ఆర్థిక పురోగతి, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠ పెంపు కోసం ప్రధానమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. దేశంలోని అత్యధిక రాష్ట్రాల్లో ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉందని, ప్రజలు బీజేపీ పాలనపై విశ్వాసం ఉంచుతున్నారని అన్నారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వం దేశ రాజకీయాల్లో నూతన అధ్యాయానికి నాంది పలికిందని, అభివృద్ధి, పారదర్శక పాలన, జాతీయతే బీజేపీ విజయాలకు ప్రధాన కారణాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూన్ 21న నీట్-యూజీ రీ-ఎగ్జామినేషన్

- పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు.
- 100 మీటర్ల పరిధిలో గుంపులు నిషేధం.
- జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేత.



నిజామాబాద్ జూన్ 12 (మనం బ్యూరో): జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష ( నీట్-యూజ-2026) రీ-ఎగ్జామినేషన్ను జూన్ 21న ప్రశాంతంగా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు నిజామాబాద్ ఇంచార్జ్ పోలీస్ కమిషనర్, కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. జిల్లాలోని గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజీ (నిజామాబాద్), యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆరట్స్ అండ్ సైన్స్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డిచ్పల్లి), గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ (బోధన్), గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ (నిజామాబాద్), శ్రీ బిగాల కృష్ణమూర్తి జెడ్పీహెచ్ఎస్ (మాక్లూర్), తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్-1 (నాగారం) కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ పరీక్ష నేపథ్యంలో జూన్ 21న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (పాత సెక్షన్ 144 సీఆర్పీసీ) అమలులో ఉంటుందని వెల్లడించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం పరీక్ష కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుంపులుగా చేరడం నిషేధం. అలాగే పరీక్షలు సజావుగా జరిగేందుకు కేంద్రాల సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ దుకాణాలు, స్టేషనరీ షాపులు ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పరీక్ష రాసే విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేసిన పోలీస్ కమిషనర్, ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# మెండోరా పటేల్ సంఘానికి స్టీల్ ప్లేట్స్ బహుకరించిన తక్కూరి అంజయ్య

భీమ్గల్, జూన్ 12 ( మనం న్యూస్ ): భీమ్గల్ మండలంలోని మెండోరా గ్రామంలో ప్రముఖ నాయకుడు తక్కూరి అంజయ్య, వారి తండ్రి కీర్తిశేషులు తక్కూరి లింబయ్య జ్ఞాపకార్థం మెండోరా గ్రామ పటేల్ సంఘానికి స్టీల్ ప్లేట్స్ బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., గ్రామంలో ప్లాస్టిక్ , పేపర్ ప్లేట్స్ వాడకాన్ని నివారించే దిశగా తన వంతు సహాయంగా ఈ కార్యక్రమం చేపట్టినానని తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో గ్రామాల్లోని ప్రతి ఒక్కరు పేపర్ ప్లేట్స్ వాడకాన్ని తగ్గించి  స్టీల్ ప్లేట్లను వినియోగించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పటేల్, సంఘు సభ్యులు పాల్గొన్నారు.



# బిజెపి పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి

రుద్రూర్, జూన్ 12 (మనం న్యూస్); రుద్రూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసిల్దార్ తారాబాయికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇందూరు జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ.. యూరియా ఆన్ లైన్ బుకింగ్ యాప్ మండల స్థాయి ప్రాతిపదికను మార్చి స్థానిక సొసైటీలు, ఫెర్టిలైజర్ షాపులకు అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. అలాగే ఎకరానికి యూరియా కేటాయింపులపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్ లైన్ ఎరువుల బుకింగ్ యాప్ వల్ల రైతులు క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, ప్రభుత్వం కానీ, అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అయితే ప్రస్తుత విధానంలో యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకునేందుకు 'మండలాన్ని' ప్రామాణికంగా తీసుకోవడం క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బందులను కలిగిస్తోందని వివరించారు. మండల కేంద్రం లేదా యాప్



సూచించిన పంపిణీ కేంద్రాలు అనేక గ్రామాలకు దూరంగా ఉంటున్నాయని, దీనివల్ల బుక్ చేసుకున్న యూరియా బస్తాలను తమ గ్రామాలకు తరలించుకోవడానికి రైతులు అదనపు రవాణా ఖర్చులు భరించడంతో పాటు వ్యయప్రయాసలకు గురవుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి, యాప్ 'మండల యూనిట్ కి ' బదులుగా రైతులకు అత్యంత చేరువలో ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను లేదా స్థానికంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫెర్టిలైజర్ దుకాణాలను పంపిణీ యూనిట్లుగా మార్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రుద్రూర్ మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు ఎర్రోళ్ల గంగాధర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, ఏముల నవీన్, ప్రధాన కార్యదర్శులు ఏముల గజేందర్, వడ్ల సాయినాథ్, ఉపాధ్యక్షులు



## వ్యవసాయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రైతులకు అవగాహన కార్యక్రమం

నాగిరెడ్డిపేట్, జూన్ 12(మనం న్యూస్): మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలో తెలంగాణ రైతు విభాగ కేంద్రం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వానాకాలంలో సాగు చేయాల్సిన పంటలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ జేకే రేవంత్ నాథన్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు అందిస్తున్న బోధన, పరిశోధన, విస్తరణ సేవల గురించి వివరించారు. వానాకాలంలో పంటల ఎంపిక, విత్తనాల వినియోగం, దిగుబడి పెంపు కోసం అనుసరించాల్సిన సూచనలను రైతులకు తెలియజేశారు.

అలాగే ఇస్రో ప్రతినిధి విష్ణు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగం ప్రాధాన్యతను వివరించారు. నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల ప్రయోజనాలు, డ్రోన్ల ద్వారా పంటల నిర్వహణ, ఎరువులు మరియు పురుగుమందుల పిచికారీ వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో మాల్తుమ్మెద గ్రామ సర్పంచ్ పుప్పాల సాయిలు, గోపాల్పేట్, చీనూర్, మాల్తుమ్మెద గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులు శాస్త్రవేత్తలను పలు వ్యవసాయ సమస్యలపై ప్రశ్నించి సూచనలు పొందారు.

# బస్వాపూర్లో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

భిక్కనూర్, జూన్ 12 ( మనం న్యూస్ ): మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన కల్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు లబ్ధి చేకూరింది. గ్రామానికి చెందిన మన్నె లక్ష్మి, వంక పున్నవ్వలకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. బస్వాపూర్ సర్పంచ్ తుడుం పద్మ స్వామి సమక్షంలో ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.

**పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం.**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ., పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థికంగా అండగా నిలవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారుల కుటుంబాలు ఈ సందర్భంగా సంతోషం



వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యుడు గంగాధరి రామచంద్రం, జీపీఓ పోచయ్య , గ్రామ ప్రముఖులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

భిక్కనూర్, జూన్ 12 ( మనం న్యూస్ ): అక్షయ రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలకు నిర్వహించిన నెల రోజుల ఉచిత టైలరింగ్ శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం సర్టిఫికెట్లను అందజేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో సర్పంచ్ మంజుల సంజీవరెడ్డి, అక్షయ రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ రజిత రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని అభ్యర్థులకు ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు.



**స్వయం ఉపాధితోనే మహిళా సాధికారత.**

ఈ సందర్భంగా సర్పంచ్ మంజుల సంజీవరెడ్డి మాట్లాడుతూ., మహిళలు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. సొంతంగా వ్యాపారాలు ప్రారంభిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం సంస్థ డైరెక్టర్ రజిత రెడ్డి మాట్లాడుతూ., గ్రామీణ ప్రాంత మహిళల్లో నైపుణ్యాలను పెంపొందించి, వారిని స్వయం సమృద్ధులను చేయడమే తమ ఆర్గనైజేషన్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. నెల రోజుల పాటు అభ్యర్థులు ఎంతో ఆసక్తితో శిక్షణ తీసుకున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు, సంస్థ ప్రతినిధులు, శిక్షణ పొందిన మహిళలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.